క్లుప్తంగా

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన పూజలు



గోకవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో వేదపండితుల ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతులు పీటలపై కూర్చొని ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు



ఏలేశ్వరంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు అనిల్‌కుమార్

ఏలేశ్వరం: ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్ కుమారి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకూ జరుగుతాయని చెప్పారు. ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108 అంబులెన్స్‌లో జన్మించిన శిశువును చూపుతున్న వాహన సిబ్బంది

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ఓ గర్భిణి శుక్రవారం 108 అంబులెన్స్‌లో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. మల్లేపల్లికి చెందిన గర్భిణి మందం వీరగనికకు పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే 108 సిబ్బంది అక్కడకు చేరుకుని ఆమెను అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం తరలిస్తుండగా తూర్పుగోనగూడెం సమీపంలోకి వచ్చేసరికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది కుటుంబ సభ్యుల సాయంతో ఆమెకు పురుడు పోశారు. వీరగనిక పండంటి మగ శిశువుకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108 వాహన టెక్నీషియన్ కె.నవీన్‌కుమార్, పైలెట్ సీహెచ్ బాలరాజు తెలిపారు.

మొబైల్స్ కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి



మొబైల్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో ఎస్సై శివనాగబాబు

గోకవరం: మొబైల్ షాపుల నిర్వాహకులు సెకండ్ హ్యాండ్ మొబైల్స్ అమ్మకాలు, కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని గోకవరం ఎస్సై యువి శివనాగబాబు సూచించారు. గోకవరం ప్రెస్‌క్లబ్ భవనంలో శుక్రవారం మొబైల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ ఆధారాలు లేకుండా మొబైల్స్ కొనుగోలు, విక్రయాలు చేయరాదన్నారు. అనుమానాస్పదంగా మొబైల్ విక్రయాలు చేస్తున్నారని అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా షేక్ గని, ప్రధాన కార్యదర్శిగా టి.విజయ్‌బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష మీడియంలో నిర్వహించే ప్రవేశ పరీక్షలకు ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1, 2013 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1, 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు దారులకు జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

పల్లెలు.. ప్రగతికి నిలయాలు

- ప్రజలకు అండగా సచివాలయ సేవలు
- సత్ఫలితాలిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- పలు పంచాయతీలకు అవార్డులు



బొద్దవరం మురుగుకాలువలో పూడిక తీస్తున్న గ్రీన్ అంబాసిడర్లు



బిళ్లనందూరు సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీని పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అన్న మహాత్మగాంధీ మాటలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోంది. ప్రభుత్వ చర్యలతో నేడు పల్లెలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, సుపరిపాలన, ప్రజారోగ్యం, పిల్లల సంరక్షణ, రక్షిత తాగునీరు, పారిశుధ్యం-పచ్చదనం, కావలసిన వనరులు సమకూర్చుకోవడం, సామాజిక బాధ్యత, మహిళల సంరక్షణ తదితర విభాగాల్లో ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోంది. ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మరోపక్క పర్యావరణ పరిరక్షణకు గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు పెంచి వాటిని సంరక్షిస్తున్నారు. కాగా పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన పలు పంచాతీయలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాలు అందించింది.

213 పంచాయతీల్లో పనులు

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 213 పంచాయతీల్లో ప్రభుత్వం నిర్దేశించిన 9 విభాగాల్లో ప్రగతి పనులు సాగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామ సచివాలయాల్లో నియమించిన వివిధ విభాగాల ఉద్యోగులు నిరంతరం గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సేవలందించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. మూడు నియోజకవర్గాల్లోనూ సుమారు 180 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ విధిగా ఇళ్ల నుంచి చెత్తను సేకరించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన కంపోస్టు ఎరువును తక్కువ ధరకు రైతులకు విక్రయించి ఒకవైపు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ మరోవైపు పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నారు.

అవార్డుల పంట

పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు మంచి సేవలందిస్తున్న పలు పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందించింది. పారిశుధ్యం-పచ్చదనంలో ప్రజలకు మెరుగైన సేవలందించిన కోటనందూరు మండలం బిళ్లనందూరు గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయిలో అవార్డు దక్కింది. జిల్లా స్థాయిలో ప్రజారోగ్యంలో తుని మండలం రాజుపేట, ప్రత్తిపాడు, పిల్లల సంరక్షణలో తొండంగి మండలం పైడికొండ, క్లీన్ అండ్ గ్రీన్‌లో తుని మండలం కేఓ మల్లవరం, కోటనందూరు మండలం బిళ్లనందూరు పంచాయతీలు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నాయి. ఉత్తమ సేవలందించిన పంచాయతీలకు ఒక్కో విభాగంలో మూడు చొప్పున ప్రతి మండలానికి 27 మండలస్థాయి అవార్డులు వచ్చాయి.

అవార్డులు బాధ్యతను పెంచాయి



పల్లెల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సిబ్బంది పనితీరు ఉండేలా చర్యలు తీసుకున్నాం. అన్ని విభాగాల్లో ప్రజలకు సేవలందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సచివాలయాలను ప్రతిరోజూ తనిఖీ చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులు మా బాధ్యతను మరింత పెంచాయి. అన్ని పంచాయతీలు 100 శాతం ప్రగతి సాధించేందుకు కృషి చేస్తాం.

– ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, ఎంపీడీఓ, కోటనందూరు

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పల్లెల్లో పారిశుధ్యం, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉంచాం. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటేలా సిబ్బందితో పాటు ప్రజలను చైతన్య పరుస్తున్నాం. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నాం.

– జి.అరుణ్‌కుమార్, పంచాయతీ విస్తరణాధికారి, కోటనందూరు

తంటికొండ వెంకన్నకు శ్రీచక్రస్నానం



తంటికొండ వెంకన్నకు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



ఎస్.అన్నవరంలో స్వామివారికి హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి శ్రీచక్రస్నానం, గ్రామోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్వామి వారి కళ్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఉదయం మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజారోహణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, వివిధ వేషధారణల నడుమ స్వామివారి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా శ్రీపుష్పయాగం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి శ్రీచక్రస్నానం, శ్రీపుష్పయాగం వైభవంగా జరిగాయి. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో గత నెల 28న ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు శ్రీపుష్పయాగంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు స్వామివారికి సుదర్శన నారసింహ హోమం, పూర్ణాహుతి, శ్రీవారి కోనేరులో చక్రస్నానం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ఆరాధన, సప్తావరనం, ధ్వజావరోహనం, మహాదాశీర్వచనం, రుత్విక సన్మానం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర, చండీ హోమాలు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు వడలి నర్సింహమూర్తి, వ్రతపురోహితుడు కూచుమంచి ప్రసాద్, తదితరులు హోమం నిర్వహించారు. మొత్తం 118 జంటలు రూ.750 టిక్కెట్ చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి, కొండ దిగువన తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముద్రగడకు అభినందనల వెల్లువ



పిఠాపురం నియోజక వర్గం నుంచి వచ్చిన అభిమానులతో ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం నివాసం శుక్రవారం అభిమానులతో సందడిగా మారింది. తుని రైలు దహనం కేసును కోర్టు కొట్టివేయడంతో ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం నియోజక వర్గాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో అభిమానులు, కాపు నాయకులు తరలివచ్చి ముద్రగడకు అభినందనలు తెలిపారు. వారికి ముద్రగడ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గం నుంచి వచ్చిన కాపు నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పిఠాపురం నియోజక వర్గం నుంచి ముద్రగడ పోటీ చేస్తే తప్పకుండా గెలిపించుకుంటామన్నారు. పలువురు కాపు నేతలు పాల్గొన్నారు.

అధిక వేగంతో వాహనాలు నడిపితే చర్యలు



తొండంగి మండలం ఒంటిమామిడిలో లారీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికుమార్

తొండంగి: భారీ వాహనాలు రహదారులపై అధిక వేగంతో రాకపోకలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్.రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో లారీ డ్రైవర్లు, టిప్పర్ల డ్రైవర్లు, ఇతర భారీ వాహనాల సిబ్బందికి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. వాహన రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదో చెక్ చేసుకున్న తర్వాతే విధుల్లో చేరాలన్నారు. లేకుంటే ఎటువంటి ప్రమాదాలకు కారణమైనా లైసెన్స్ రద్దు అవుతుందని, తద్వారా జీవనోపాధి పోతుందన్నారు. గ్రామీణ రహదారులపై నెమ్మదిగా వాహనాలను నడపాలన్నారు. లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఆర్.వెంకటరమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలి



యర్రవరంలో తడిసిన వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న రైతులు

ఏలేశ్వరం: అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తమ పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి సూచించారు. మండలంలోని యర్రవరంలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని, వరి పనలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో 4130 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారన్నారు. ఇప్పటికే 95 శాతం కోతలు పూర్తయ్యాయని, ఎ గ్రేడ్ రకాలను రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించారని, సాధారణ రకాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా 1800 క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. తడిసిన వరి పంట మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. కళ్లాల్లో ఉన్న పంటను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని, ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపల్లి: కొమరగిరిలో వేంచేసిన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా గత నాలుగు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఉదయం పండితులు స్వామివార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దశాబ్దాల కల సాకారం

- కోటనందూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కోటనందూరు హైస్కూల్

కోటనందూరు: మండల ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. స్థానిక జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ శేషగిరిబాబు జీఓ విడుదల చేశారు. తక్షణమే కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారిని ఆదేశించారు. మండల కేంద్రం కోటనందూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక దశాబ్దాలుగా అనేక మంది ఆడపిల్లలు, పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. గత పాలకులు అనేక పర్యాయాలు జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పించినా..అవి కార్యరూపం దాల్చలేదు. మంత్రి దాడిశెట్టి రాజా గత ఎన్నికల సమయంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామని మండల ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు హామీని కళాశాల ఏర్పాటులో పలు ఇబ్బందులు ఎదురైనా వాటన్నింటికీ అధిగమించి భగీరథ ప్రయత్నంతో కాలేజీని సాధించారు. కోటనందూరులో కాలేజీ ఏర్పాటు పట్ల మండల ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, వారి దల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సకహరించాలి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

జగ్గంపేట: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రజలు సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి కోరారు. మండలంలోని మల్లిసాలలో శుక్రవారం నేరాల అదుపులో గ్రామస్తుల పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సారా తయారీ, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. పెద్దాపురం డివిజన్ పరిధిలో నేరాలు అదుపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. మహిళలపై ఎవరైనా దురుసుగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహన డ్రైవింగ్ సమయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా మంది మృత్యువాత పడుతున్నారని, దిచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వేసవిలో చోరీలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్, సీఐ సూర్యఅప్పారావు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు గ్రామ సర్పంచ్ సర్వసిద్ధి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రై డే- ఫ్రై డే



కేపీ మల్లవరంలో విద్యుత్ మీటరు రీడింగు నమోదు చేస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం డ్రై డే- ఫ్రై డే నిర్వహించారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించి మురుగు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, డ్రైన్లను శుభ్రం చేయించారు. మురుగు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కేపీ మల్లవరం, కోటనందూరు, టీజేనగరం, బొద్దవరం గ్రామాల్లో జరిగిన పనులను పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్ కుమార్ పరిశీలించారు.

విధిగా విద్యుత్ రీడింగ్ నమోదు చేయాలి

కోటనందూరు: గ్రామాల్లో వీధి లైట్లు, మంచినీటి రిజర్వాయర్ల వినియోగానికి సంబంధించి విద్యుత్ రీడింగును విధిగా నమోదు చేయాలని ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామంలో వీధిలైట్లు, మంచినీటి ట్యాంకులకు సంబంధించి ఎన్ని మీటర్లు ఉన్నాయో గుర్తించి నెలనెలా రీడింగు నమోదు చేయాలన్నారు. విద్యుత్ శాఖ రీడర్లు తీసిన రీడింగు, పంచాయతీ సిబ్బంది తీసిన రీడింగు సరిచూసి సంతృప్తి చెందితేనే బిల్లు చెల్లించాలని సూచించారు. కేపీ మల్లవరంలో ఈఓపీఆర్డీ స్వయంగా రీడింగు తీసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సింహాద్రి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శర్మ

కోటనందూరు: గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ పరిశీలించారు. నెల రోజుల క్రితం సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో కోటనందూరులో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింహాద్రికాలనీ, కాపుల వీధిలో సీసీ రోడ్లు, డ్రైన్లు, రెల్లిపేటలో డ్రైన్లు నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ఈ మేరకు స్పందించిన మంత్రి రాజా తక్షణమే పనులు పూర్తి చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, గర్సింగు శ్రీను పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన కంటి వైద్య సేవలు



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న దాడిశెట్టి విష్ణుచక్రం

తుని: పేద ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని ప్రముఖ సంఘ సేవకులు, ధనలక్ష్మి జ్యూయలరీ అధినేత దాడిశెట్టి విష్ణుచక్రం పేర్కొన్నారు. తుని పట్టణంలో పిఠాపురం డాక్టర్ గారి వీధిలో అగర్వాల్ కంటి ఆసుపత్రిని దాడిశెట్టి విష్ణుచక్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగర్వాల్ కంటి హాస్పటల్ యాజమాన్యం తుని నియోజకవర్గంలో చేపట్టే కంటి వైద్య శిబిరాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. డాక్టర్ అగర్వాల్ ప్రాథమిక విజన్ కేర్ సెంటర్ నిర్వాహకులు ఎ. నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల కంటి ఆపరేషన్లు, వైద్య పరీక్షలు నిష్ణాతులైన వైద్యులు నిర్వహిస్తారని, తమ ఆసుపత్రి పేదలకు అందుబాటులో ఉండడంతోపాటు, నగదు రహిత ఆపరేషన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అంధత్వ నివారణ కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ నేహకమలిని, రంగాల గోవిందు, పాలిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బండి కండిషన్ నిల్.. పొగ ఫుల్



ఏలేశ్వరంలో లారీ నుంచి భారీగా వస్తున్న పొగ

ఏలేశ్వరం: వాహనాల నుంచి వచ్చే కాలుష్యం (పొగ)తో ఏలేశ్వరం పట్టణ, మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని జె.అన్నవరం, అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామాల్లోని క్వారీల నుంచి నిత్యం భారీవాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనాలు కండీషన్‌లో లేకపోవడంతో వాటి నుంచి భారీగా పొగ వస్తోంది. వాయు కాలుష్యం కారణంగా సమీప ప్రాంతాల్లోని ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలో నిత్యం రాకపోకలు సాగించే భారీవాహనాలు కండీషన్‌లో లేకపోవడంతో వాటి నుంచి విపరీతంగా పొగ వచ్చి రోడ్లకు సమీపంలో ఉంటే ఇళ్లు, ప్రాంతాలు నల్లగా మారిపోతున్నాయి. పొగ కారణంగా వాహనదారులకు రహదారులు కనిపించని పరిస్థితి నెలకొంది. దీనిపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పంట కాలువ



వ్యర్థాలతో నిండిపోయిన పంటకాలువ

ఏలేశ్వరం: వందలాది ఎకరాలకు నీరు అందిస్తున్న ప్రధాన పంటకాలువ అధ్వానంగా మారింది. పట్టణంలో సుమారు కిలో మీటరున్నర పొడవున విస్తరించి ఉన్న పంట కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. కాలువను అనుకుని ఉన్న దుకాణాలు, హోటల్స్, ఆసుపత్రుల నుంచి వచ్చే వ్యర్థాలను కాలువలో వేయడంతో కుళించుకుపోయింది. దీంతో నీరు ముందుకు పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.